క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతారామపురం సబ్‌స్టేషన్ 11కేవీ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేటలోని దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, బోయపాటి వారి వీధి, ఏలూరు రోడ్ ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్ వీధి, రాజు మేడ ఏరియా, గోపరాజు రామచంద్రరావు రోడ్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

గంజాయి బ్యాచ్ కోసం తనిఖీలు

పాయకాపురం(విజయవాడరూరల్): సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం నున్న పోలీసులు గంజాయిబ్యాచ్ కోసం తనిఖీలు చేశారు. స్టేషన్ పరిధి వాంబే కాలనీలోని పలు ప్రాంతాల్లో సీఐ పి.కృష్ణమోహన్ సిబ్బందితో మఫ్టీలో తనిఖీలు చేశారు. డిస్నీల్యాండ్, దేవినేని గాంధీపురం, శాంతినగర్, పరిసర ప్రాంతాల్లో గాలించారు. పీఎస్ పరిధిలో గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ కృష్ణమోహన్ చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఎస్ఐ పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక సూచించారు. చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని యూపీహెచ్‌సీలో మంగళవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమన్నారు. సరైన అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చని చెప్పారు. నీ తోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ నజ్మా మాట్లాడుతూ యువతలో వచ్చే సమస్యలకు అనుభవం కలిగిన సైకియాట్రిస్ట్, సైకాలజిస్టులతో మానసిక వికాసకేంద్రాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ అయేషా ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశ, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు పనిచేయాలని కక్షసాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి ప్రభల శ్రీనివాస్, పార్టీ సేవాదళ్ ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్ నారాయణ అన్నారు. ముత్యాలంపాడులో మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు మనోభావాలను ప్రకటించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం.. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించడం తగదన్నారు. సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని కోరారు.

నేషనల్ హైవే బైపాస్ పరిశీలన

పాయకాపురం(విజయవాడరూరల్): నేషనల్ హైవే 16 బైపాస్ రోడ్డును నగర ట్రాఫిక్ డెప్యూటీ పోలీసు కమిషనర్ టి. కృష్ణమూర్తినాయుడు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. గొల్లపూడి నుంచి చినఅవుటుపల్లి వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. రోడ్డు మధ్యలో జరుగుతున్న పనులపై సంబంధిత నేషనల్ హైవే అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పెండింగ్‌లో పనులను వేగవంతం చేసి పూర్తి చేస్తే సంక్రాంతి పండుగ నాటికి రోడ్డుపై రాకపోకలను సాగించవచ్చని తెలిపారు. డీసీపీతో పాటు ట్రాఫిక్ ఏసీపీ టి.రామచంద్రరావు, సీఐలు ఉన్నారు.

విస్తరణకు ఇబ్బంది కలగకుండా చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం, దేవీనగర్ రోడ్డు విస్తరణ పనుల దృష్ట్యా కార్పొరేటర్ బీ హెచ్ఎస్‌వీ జానారెడ్డి మంగళవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ విద్యుత్ స్తంభాలు వరుస క్రమంలో లేకపోవడంతో రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. దీంతో తాను.. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్తంభాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రజల అవసరాలు, రోడ్డు విస్తరణకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దీనావస్థలో జింఖానా

● ధ్వంసమైన కళావేదిక ● శిథిలావస్థలో గదులు

● మైదానంలో కూలిపోయిన రెండు వైపులా ప్రహరీ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నగరంలో ఎంతో ఘనకీర్తి కలిగిన ఆంధ్ర జింఖానా మైదానం నేడు అధ్వాన స్థితికి చేరింది. ఈ మైదానంలో ఒకప్పుడు సభలు, సమావేశాలు, ధార్మిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్.. ఇలా ఒకటేమిటీ అనేకం ఇక్కడ జరిగాయి. ప్రముఖుల రాజకీయ సభలు ఇక్కడే నిర్వహించేవారు. వివిధ కార్యక్రమాల నిర్వహణతో కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేది. అలాంటి మైదానం ఇప్పుడు కళతప్పి దీనావస్థకు చేరింది.



ప్రహరీ లేని మైదానం.. లోపల నిలిపి ఉంచిన ప్రైవేటు వాహనాలు

ప్రహరీ లేదు

గాంధీనగర్ జీఎస్ రాజు రోడ్డు, జ్ఞానోలిప్ రోడ్డుకు మధ్యన జింఖానా మైదానం ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో మైదానాన్ని వివిధ కార్యక్రమాలకు అద్దెకు ఇస్తుంటారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ సమావేశం నిర్వహించడానికి దక్షిణం వైపు ప్రహరీ కూల్చారు. ఆ తర్వాత కాలంలో పడమర వైపు ప్రహరీ శిథిలమై కూలి పోయింది. గోడ కూలడంతో దానికి ఏర్పాటు చేసిన పెద్ద గేటు తీసేశారు. రెండు వైపులా ప్రహరీ లేక సక్రమంగా పట్టించుకోకపోవడంతో.. మైదానంలో సభలు, సమావేశాల నిర్వహణకు నిర్మించిన కళావేదిక రేకుల షెడ్డు ధ్వంసమైంది. పూర్వం నాటకాలు వేసే కళాకారులు డ్రెస్సింగ్ చేసుకునేందుకు వేదిక మీద నిర్మించిన రెండు గదులు పూర్తిగా పాడైపోయాయి. వేదిక మొత్తం పిచ్చి మొక్కలు మొలిచి కళా విహీనంగా తయారైంది. ఆ ప్రాంగణంలో బూడిద వేయడంతో లోపల తిరిగి దుమ్ము లేస్తోంది. కార్యక్రమాలు తగ్గిపోవడంతో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం పడిపోయింది. ఇప్పుడు ఇక్కడ ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఎంతో పేరు కలిగిన మైదానం నేడు దీనావస్థకు చేరుకోవడంతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ధ్వంసమైన కళావేదిక



షాపుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా..

నిరుపయోగంగా షెడ్లు..

ఐనాక్స్ ఎదుట ఉన్న రాజగోపాలచారి మార్కెట్‌ను తొలగించి కొత్తగా నిర్మాణాలు చేపట్టాలని కార్పొరేషన్ భావించింది. అక్కడ కూరగాయల మార్కెట్ నిర్వాహకులకు ప్రత్యామ్నాయంగా జింఖానా మైదానంలో ..రెండు వైపులా రేకుల షెడ్లు నిర్మించారు. ఇందుకు లక్షల్లో ఖర్చు చేశారు. షాపుల కోసం షెడ్లు నిర్మించారే గానీ వినియోగించలేదు. దీంతో నిరుపయోగంగా మారాయి. ప్రహరీ లేకపోవడంతో ఇక్కడ ఇష్టారాజ్యం అయింది. చిరువ్యాపారులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చినా కార్పొరేషన్‌కు నిత్యం ఆదాయం వచ్చేది. కానీ అలా చేయలేదు. రాత్రి వేళల్లో మందు బాబులు ఆ షెడ్లలో మద్యం సేవిస్తున్నారు. ఆకతాయిలు తిష్ట వేస్తున్నారు. ఆవరణ మొత్తం బూడిద.. రాళ్లతో అధ్వానంగా మారింది. విజయవాడ నగరంలో ఒక మాన్యుమెంట్‌లా వెలిగిన జింఖానా మైదానానికి ఏమిటీ దుస్థితి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పూర్వ వైభవం తేవాలి



జింఖానా మైదానం ఒకప్పుడు బాగా వెలుగొందింది. రాజకీయ సభల నుంచి ధార్మిక కార్యక్రమాల వరకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరిగేవి. ఇతరులు ఎవ్వరూ లోపలకి ప్రవేశించకుండా ప్రహరీ, పెద్ద గేటు ఉండేది. ఈలపాట రఘురామయ్య పేరిట చక్కటి కళా వేదిక ఉండేది. ఇపుడది శిథిలమైంది. మైదానానికి రెండు వైపులా ప్రహరీ నిర్మించాలి. వేదిక ఏర్పాటు చేసి జింఖానాకు పూర్వ వైభవం తేవాలి.

– జె.మల్లికార్జున్, స్థానికుడు

బాబా మందిరం అభివృద్ధికి రూ.60 వేలు విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీసాయిబాబా మందిరం అభివృద్ధికి మంగళవారం దాత ఉప్పలపాటి వెంకట భార్గవ సాయివర్మ రూ.60 వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డికి అందజేశారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో మందిరాన్ని ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దామన్నారు. దాత ఉప్పలపాటి వెంకట భార్గవ సాయి వర్మ మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం చిత్రపటంతో దాతను సత్కరించారు. మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

శివకేశవులకు ప్రీతికరం.. కార్తికం

విజయవాడ కల్చరల్: శివ కేశవులకు ప్రీతిపాత్రమైన మాసం కార్తికమని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకుడు మురళీకృష్ణస్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన టీటీడీ కల్యాణమండపంలో నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం కార్తిక మాస వైభవం అంశంగా ప్రసంగించారు. టీటీడీ దేవాలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి ప్రత్యేక పూజలు చేశారు.

సోషల్ మీడియా ప్రతినిధులను వేధిస్తే సహించం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



సోషల్ మీడియా కన్వీనర్లతో మాట్లాడుతున్న విష్ణు, శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని.. తప్పుడు కేసులు పెట్టి సోషల్ మీడియా ప్రతినిధులను వేధించాలని చూస్తే సహించబోమని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో రాష్ట్ర ప్రజలను ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారో ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వంలో వ్యవస్థలు ఎంత అధ్వానంగా పనిచేస్తున్నాయో స్వయంగా డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటలు వింటేనే అర్థమైపోతుందని.. వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల గొంతును నొక్కేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయడం దారుణమని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోందన్నారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గ పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే 6 అక్రమ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమ కేసులకు ఎవరూ అధైర్యపడొద్దని.. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నాయకులు అలంపూర్ విజయ్, కుక్కల రమేష్, కాళ్ల ఆదినారాయణ, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

'సాంకేతిక'తో ట్రాఫిక్ సమస్యకు చెక్

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



ట్రాఫిక్ పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు. లైవ్ డ్రోన్ కెమెరాలతో జరుగుతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణను సీపీ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించి ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రద్దీ నియంత్రణకు లైవ్ డ్రోన్ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామని, అక్కడ నుంచి వస్తున్న ఆదేశాలను సిబ్బంది తు.చ. తప్పకుండా పాటిస్తూ ప్రయాణికులకు సహకరించాలని సూచించారు. వాహనచోదకులకు రవాణా సులభతరం చేయడానికి అందుబాటులోని అస్త్రం యాప్, డ్రోన్ కెమెరాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ప్రసన్నకుమార్, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఐ ధర్నా



ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వంలోని నాయకులు సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపి మోసం చేస్తున్నారని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ట్రూఅప్ చార్జీలను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా జరిగింది. చుట్టుగుంట విశాలాంధ్ర కార్యాలయం నుంచి బ్రహ్మానందరెడ్డినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేసి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోలోని అంశాలను కూటమి ప్రభుత్వం 4 నెలల్లోనే తుంగలో తొక్కిందన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రజలకు కల్లిబొల్లి మాటలు చెప్పి ఓట్లు పొందారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు అనేది కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన దీపావళి బోనస్ మాదిరిగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే డిస్కంలకు చెల్లించాల్సిన రూ.18 వేల కోట్ల రూపాయల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పురబోతు రాము, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మల్లేశ్వరుడికి దీపార్చన



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. అనంతరం మల్లేశ్వరస్వామి ఆలయం ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఆది దంపతులకు దీపార్చన నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారి పంచహారతుల సేవలోనూ, సహస్ర లింగార్చన, దీపార్చనలో పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి



పుట్టలో పాలుపోస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగేంద్రస్వామి పుట్టల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది. మంగళవారం నాగులచవితి కలిసి రావడంతో భక్తులు విశేష సంఖ్యలో ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో సమయం పట్టింది. నాగేంద్రస్వామికి పూజలు చేసి బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు.

● ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జంటనాగులకు విశేష అభిషేకం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు పర్యవేక్షించారు.

● శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో..

మధురానగర్‌లోని స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో మహిళలు దీపారాధనలు చేశారు.

● దావు బుచ్చయ్యకాలనీలోని పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలోని నాగుల పుట్టలో భక్తులు పాలు పోశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి పర్యవేక్షణలో మహిళా భక్తులు సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించారు. జంట నాగుల విగ్రహాలకు పాలతో అభిషేకాలు చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక-పాతపాడు గ్రామ శివారు శివనాగేంద్రస్వామి ఆలయంలో 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు దంపతులు పూజలు చేశారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు.



లెనిన్ సెంటర్‌లో నాగమానసాదేవి ఆలయంలో..



మధురానగర్‌లోని పుట్ట వద్ద..



దావు బుచ్చయ్యకాలనీలో ..

హిందీ నాటకాలకు ఎంతో ప్రాధాన్యం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో రాజభాష అమలులో హిందీ నాటకాల ప్రాముఖ్యత ఎంతో ఉందని విజయవాడ డీఆర్ఎం, పట్టణ అధికార భాష అమలు కమిటీ చైర్మన్ నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీఆర్ఎం కార్యాలయంలో 68వ పట్టణ అధికార భాష అమలు కమిటీ సమావేశం జరిగింది. డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రోజు వారీ విధుల్లో తప్పనిసరిగా హిందీ ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హిందీ భాష అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికార భాష డీజీఎం డాక్టర్ శ్యాంసుందర్ సాహూ, అధికార భాష అమలు కమిటీ డెప్యూటీ డైరెక్టర్ అనిర్బన్‌కుమార్ విశ్వాస్, ఎం.కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న భవానీపురం పున్నమిఘాట్ (బబ్బూరి గ్రౌండ్) వద్ద నిర్వహించనున్న సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. సీ ప్లేన్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆయన మారిటైం బోర్డ్ సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కె.చైతన్య, ఈవెంట్ ఆర్గనైజర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సీ ప్లేన్ వేడుకలకు సీటింగ్ ఏర్పాట్లు, ప్రవేశ ప్రణాళిక, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ జల మార్గంలో విజయవాడ, శ్రీశైలం మధ్య గగన విహారం చేసే ఈ అద్భుతమైన ప్రయోగాన్ని వీక్షించేందుకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతులను ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సర్కిల్-1 జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ప్రొఫైలింగ్ యాప్

పటమట(విజయవాడతూర్పు): స్వయం సహాయక బృందాల్లో కచ్చితమైన వివరాల కోసం మెప్మా రూపొందించిన (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైల్ యాప్ అందరూ వినియోగించేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ లత అన్నారు. మంగళవారం ఆమె సీతన్న పేటలోని జీఎస్ఆర్ కల్యాణ మండపంలో మెప్మా సిబ్బందికి రిసోర్స్ పర్సన్‌లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 16 వేల స్వయం సహాయక సంఘాల 1,60,000 మంది సభ్యుల సమాచారాన్ని నవీకరణకు మెప్మా కార్యక్రమం చేపట్టిందన్నారు. చాలా సంఘాల్లో సభ్యులు మరణించిన వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన, కొంతమంది రెండు మూడు సంఘాల్లో కూడా ఉన్నా.. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించలేక కొన్ని సంఘాలు మధ్యలోనే నిలిచిపోయాయని అలాంటి వాటిని ఇకపై నవీకరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏఏ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా సర్వేకు సన్నాహాలు చేస్తుందన్నారు. నెలాఖరులోపు వీఎంసీ పరిధిలోని అన్ని గ్రూపులు, గ్రూపు సభ్యుల వివరాలు లక్ష్యంగా యాప్‌లో పొందుపరచాలని, సంఘాల్లో ఎంతమంది కొనసాగుతున్నారు, ఎంతమంది తొలగిపోయారు, కొత్తగా చేరిన వారిలో బ్యాంకు రుణాలతో ఉపాధి పొందిన వారు తదితర వివరాలు పొందుపరచాలన్నారు. మెప్మా సిబ్బంది టెక్నికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఫణికుమార్, శేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం



విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దామోదర జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం జానపద గీతాల కార్యక్రమం, మాతృభాషా వికాసం అంశం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పాలకులుగానీ, పాలితులుగానీ భాషను నిర్లక్ష్యం చెయ్యడం తగదన్నారు. ప్రవాసాంధ్ర కార్డియాలజిస్ట్ శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని మారుమూల ప్రాంతంలో జన్మించిన శ్రీనివాసరెడ్డి అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా స్థిరపడినట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన పరుచూరి విజయలక్ష్మి, సినీ నిర్మాత దర్శకుడు పసుపులేటి వెంకటరమణ, డాక్టర్ కొండా వేణుగోపాల రెడ్డి, ఇండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. దామోదర జానపదం వ్యవస్థాపకుడు దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో జానపద, సినీ గీతాలన ఆలపించారు. డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.